


ముద్దను నిర్లక్ష్యం చేస్తే మూడినట్టే

పశువులకు సోకే అతి ప్రాణాంతక వ్యాధుల్లో ప్రధానమైనది ముద్ద చర్మం (లంపీ స్కిన్) వ్యాధి. ఇది అధికంగా తెల్లజాతి పశువుల్లో వస్తోంది.


8లో

ఆలయానికి ఇత్తడి ద్వారం



పిఠాపురం: పిఠాపురం వేణుగోపాల స్వామి ఆలయంలో గర్భగుడికి హైదరాబాద్‌కు చెందిన తీడ వెంకటేశ్వరరావు దంపతులు రూ.1.10 లక్షలతో ఇత్తడి ద్వారాన్ని తయారు చేయించారు.

సముద్రంలోకి 4.64 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 4,64,386 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 7.60 అడుగులకు నీటి మట్టం చేరింది. భద్రాచలంలో 32.50 అడుగుల నీటి మట్టం నమోదైంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఎంసీ ఎన్నికలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: పాఠశాల యాజమాన్య కమిటీలకు గురువారం నిర్వహించే ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను, డీఎస్పీలను ఆయన ఆదేశించారు. అలాగే జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. జిల్లాలో 1581 ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లోని ఎస్‌ఎంసీ సభ్యులను ఎన్నుకునేందుకు గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయని, ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకుని కమిటీ సభ్యులను ఎన్నుకుంటారన్నారు. మధ్యాహ్నం 1.30 నుంచి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఆ సభ్యులు ఎన్నుకుంటారన్నారు. అనంతరం 2 గంటలకు ఎస్‌ఎంసీ సభ్యుల ప్రమాణ స్వీకారం, అనంతరం కమిటీల మొదటి సమావేశం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో జరుగుతుందని పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు అబ్జర్వర్లుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ధ్వజస్తంభానికి ధగధగలు



ధ్వజస్తంభానికి తాపడం చేయనున్న స్వర్ణ కవచాలు

అన్నవరం: సత్యదేవుని ఆలయం మరో అపురూప ఘట్టానికి వేదికవుతోంది.. స్వర్ణకాంతులు ప్రసరింపజేయనుంది.. రత్నగిరి వాసుడు సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి వజ్ర కిరీటం అలంకరించిన 48 గంటల్లోనే మరో వేడుక జరగనుంది. ఆలయంలో నూతన ధ్వజస్తంభానికి స్వర్ణ కవచాలు తాపడం చేసే కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభం కానుంది. శ్రావణ శుద్ధ పంచమి, శుక్రవారం ఉదయం ధ్వజస్తంభానికి సంప్రోక్షణ చేసిన అనంతరం స్వర్ణ కలశాలు, సుదర్శనచక్రం అమర్చి ప్రత్యేక పూజలు చేయడంతో ఈ కార్యక్రమం పూర్తవుతోంది. రాగి రేకులపై బంగారు పూత పూసిన ధ్వజస్తంభం కవచాలు ఇప్పటికే దేవస్థానానికి చేరాయి. ఆలయంలో వాటిని భద్రపరిచారు. నెల్లూరుకు చెందిన దాతల సహకారంతో రూ.3 కోట్లతో పాత ధ్వజస్తంభం స్థానంలో కొత్తది, దానికి స్వర్ణ కవచం అమర్చాలని గత ఏడాది అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ నిర్ణయించారు. దానికి అనుగుణంగా గత నవంబర్‌లో ధ్వజస్తంభం కోసం 'నారేప' జాతి కలప సేకరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న స్వామివారి ఆలయానికి అభిముఖంగా అనివేటి మండపంలో దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ సమక్షంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు.

చౌకబారు ఆలోచన!



అలమూరు మండలం మూలస్థానం అగ్రహారంలో ఎండీయూ వాహనం ద్వారా ఇళ్ల వద్ద ఇస్తున్న రేషన్

ఔను.. బాబుగారికి పేదల సంక్షేమం పట్టదు. ఆయన చూపంతా పెద్దలపైనే అనే విమర్శలకు ఇంటింటికీ రేషన్ సరుకుల నిలిపివేత తాజా ఉదాహరణ. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకుల నుంచి ఓ మధ్య తరగతి ఉద్యోగి వరకు నిత్యం పనికి వెళ్తే కానీ ఇంటిని పోషించుకోలేని పరిస్థితి. అలాంటిది ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా అందించే నిత్యావసర వస్తువులు తీసుకోవాలంటే సదరు లబ్ధిదారు ఆరోజు సెలవు పెట్టాల్సిందే. కూలీనాలీ చేసుకునేవారికైతే ఆ రోజు కూలీ పోయినట్టే. ఈ పరిస్థితిని అంచనా వేసే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రేషన్ సరుకులను ఇంటింటికీ పంపే ఏర్పాటు చేసింది. పనికి వెళ్లేవారు వెళ్లినా ఇంట్లోని వృద్ధులు, చిన్న పిల్లలు ఎవరో ఒకరు సరకులు తీసుకునేలా సాంకేతికతను వృద్ధి చేసింది. గత కాలంలో రేషన్ కోసం దుకాణానికి వెళ్తే సరకు ఉంటుందో లేదో తెలీదు. తూకాల్లో తేడాలు.. మంది ఎక్కువైతే డీలర్ల చీదరింపులు.. కోపంతో రేపు రండనో.. టైమైపోయిందనో బెదిరింపులు.. ఇవన్నీ ఇంకా ఎవరూ మరువలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంతో మళ్లీ ఆ రోజులు రానున్నాయి. నోరెత్తితే కార్డు ఎక్కడ పీకేస్తారోనని లబ్ధిదారుల మౌనం. ఇస్తున్న రేషనే ఎక్కువ.. మళ్లీ ఇంటింటికీ ఇవ్వాలా అనే పాలకుల ఆలోచనో.. గత ప్రభుత్వం ఆనవాళ్లు ఉండకూడదనుకున్నారో ఏమో.. లబ్ధిదారులు మాత్రం ఉసూరుమంటున్నారు.

- ఇంటింటికీ రేషన్‌కు బ్రేక్
- తేల్చి చెప్పిన సీఎం చంద్రబాబు
- వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ఇబ్బందులు
- తీరప్రాంత మత్స్యకారులకు ఇక్కట్లు
- మళ్లీ డీలర్ల వద్ద పడిగాపులు
- పంచదార పంచని బాబూ సర్కార్

సాక్షి అమలాపురం: ఎన్నికల వాగ్దానాలైన సూపర్ సిక్స్‌లో సంక్షేమ పథకాల అమలు లేదు. అమలు చేస్తారన్న గ్యారంటీ కూడా లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల శ్రేయస్సు కోసం ప్రవేశపెట్టిన పథకాలకు సైతం కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించిన బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం బ్రేకులు వేసింది. దీనితో వృద్ధులు.. వితంతువులు.. ఒంటరి మహిళలు.. తీర ప్రాంతాల్లో నివాసముంటున్న మత్స్యకారులు ఇక రేషన్ ద్వారా అందే బియ్యం, ఇతర వస్తువుల కోసం షాపుల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 555 వరకు మొబైల్ డిస్పెన్సర్ యూనిట్లు (ఎండీయూ వాహనాలు) ఉన్నాయి. వీటి ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందేవి. నిర్ణీత కాలంలో ఇంటి వద్దకే వాహనాలలో రేషన్ సరుకులు వస్తే, వలంటీర్లు ఇచ్చిన సమాచారంతో లబ్ధిదారులు వాటిని తీసుకునేవారు. జిల్లాలో



గతంలో బాబు ప్రభుత్వంలో రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారుల పాట్లు ఇవీ.. (ఫైల్)

5,47,723 రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా వారి ఇళ్ల వద్దనే రేషన్ సరుకులు అందజేస్తున్నారు. వీటిలో ఏఏవై కార్డులు 24,501 ఉండగా, నెలకు తొమ్మిది వేల టన్నుల బియ్యం, ఇతర వస్తువులు అందజేసేవారు. జిల్లాలోని 926 రేషన్ షాపులలో డీలర్లతోపాటు ఈ వాహనాల డ్రైవర్లు, అసిస్టెంట్లు ఉపాధి పొందేవారు.

ఇంటికి రేషన్ బంద్

ఎండీయూ వాహనాల ద్వారా ఇంటికే రేషన్ అందించే విధానానికి కూటమి ప్రభుత్వం బ్రేకులు వేస్తున్నట్టు ఇప్పటికే వెల్లడించింది. ఈ వ్యవస్థ వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడుతోందని ప్రభుత్వం భావించింది. ఆదాయం పెంచి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని గొప్పలకు పోయిన సీఎం చంద్రబాబు నాయుడు పథకాల అమలులో ప్రభుత్వంపై భారం పేరుతో సంక్షేమానికి తూట్లు పొడుస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ప్రజలకు పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు అందించకుండా మరికొంత భారం తగ్గించుకుంటోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పంచదార.. కందిపప్పులకు బ్రేక్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార వంటి నిత్యావసర వస్తువులు, సరుకులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బియ్యం మాత్రమే ఇస్తున్నారు. రేషన్ లబ్ధిదారుకు ఉచిత బియ్యంతో పాటు కేజీ కందిపప్పు, అర కేజీ పంచదార ఇవ్వాల్సి ఉంది. ఈ విధంగా చూస్తే నెలకు 547.723 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 273.861 టన్నుల పంచదార అవసరం. రేషన్ షాపుల్లో రూ.67కు కేజీ కందిపప్పు, రూ.17కు అరకేజీ పంచదార అందించేవారు. కాని కూటమి ప్రభుత్వం రెండు నెలలుగా ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వం ధరల నియంత్రణలో భాగంగా రైతు బజార్, ఎంపిక చేసిన దుకాణాల్లో రాయితీపై కందిపప్పు అందిస్తున్న విషయం తెలిసిందే. అది కూడా కేజీ రూ.150కి కావడం గమనార్హం. అంటే రేషన్ షాపు ద్వారా అందించేదాని కన్నా రూ.83 అదనం కావడం విశేషం. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన పంచదార, కందిపప్పు ప్యాకెట్ల తూకంలో తేడా వస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పంచదార సరఫరా నిలిపివేయాలని ఆదేశించారని అధికారులు చెబుతున్నారు. తూకం తేడా వచ్చిన ప్రాంతంలో ఆపాల్సింది పోయి, జిల్లా వ్యాప్తంగా ఆపివేయడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

ఇది అంబాజీపేట మార్కెట్ యార్డులోని పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలోని గోదాము. ఇక్కడ సుమారు 69 టన్నుల పంచదారను నిల్వ ఉంచారు. మూడు నెలలుగా పంచదార సరఫరాను రేషన్ దుకాణాలకు పంపకుండా ఇక్కడే నిల్వ చేశారు. ప్యాకింగ్‌లో గ్రాములు తక్కువగా ఉండటం వల్ల నిలిపివేసినట్టు అధికారులు చెప్పారు. ఇక్కడ నుంచి జిల్లాలోని అయినవిల్లి, అల్లవరం, అమలాపురం, అంబాజీపేట, ఉప్పలగుప్తం మండలాలకు సరఫరా చేస్తారు. మొత్తం 211 రేషన్ షాపులకు వెళ్లాల్సి ఉంది.



అంబాజీపేట ఏఎంసీలోని పౌరసరఫరాల శాఖ గొడౌన్‌లో ఉన్న పంచదార బస్తాలు

ఐదేళ్లు అందించారు



దుకాణానికి వెళ్లకుండా రేషన్ సరుకులను ఐదేళ్ల పాటు వాహనంలో ఇంటికి తెచ్చి అందించేవారు. ప్రస్తుతం రేషన్ వాహనాలను నిలిపివేస్తారంటున్నారు. షాపునకు వెళ్లి తెచ్చుకోవాలంటున్నారు. అక్కడికి వెళ్లి తెచ్చుకునే పరిస్థితి లేదు. ఇంటికి తెచ్చి రేషన్ సరుకులు ఇస్తే బాగుండేది.

– మల్లాడి సత్యవతి, నాగపట్టణం

ఇంటి వద్దనే ఇవ్వాలి



రేషన్ ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించాలి. దీని వల్ల మాకు చాలా ప్రయోజనం. మహిళలు రేషన్ షాపు వరకు వెళ్లడం చాలా ఇబ్బందిగా ఉంటోంది. బియ్యంతో పాటు గతంలో ఇచ్చినట్టుగా పంచదార, కందిపప్పు, గోధుమ పిండిని అందించాలి.

– పెమ్మాడి నాగమణి, మండపేట

60 కుటుంబాలకు ఇబ్బంది



మా ఇల్లు ఊరికి చివరికి ఉంటుంది. రేషన్ డిపోకు వెళ్లాలంటే కనీసం మూడు కిలోమీటర్లు వెళ్లాలి. అంత దూరం వెళ్లాలంటే ఇబ్బంది. ఇంటింటికీ రేషన్ ఇస్తేనే మాకు సౌకర్యంగా ఉంటోంది. మాకే కాదు, మా చుట్టూ 60కి పైగా కుటుంబాలుకు కూడా రేషన్ దుకాణాలకు వెళ్లడం ఇబ్బందికరం.

– కొల్లు రాధాకృష్ణ, కాట్రేనిపాడులంక, రాజోలు మండలం

పనులు మానుకుని వెళ్లాలి



రేషన్‌కు వెళ్లాలంటే ఒక రోజు పని మానుకోవాలి. దీనిని గుర్తించే గత ప్రభుత్వం ఇంటికే రేషన్ సరఫరా చేసింది. దీనిని రద్దు చేస్తాననడం మంచిది కాదు. గత ప్రభుత్వం బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార సరఫరా చేస్తే ఈ ప్రభుత్వం ఇవడం లేదు.

– లంకే వెంకట కృష్ణ, ఆత్రేయపురం

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్

కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: చేనేత దినోత్సవం సందర్భంగా ఆ కార్మికులను గౌరవించడం చేనేత పరిశ్రమకు ప్రేరణ కల్పించినట్టేనని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని మహాత్మా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో చేనేత సొసైటీ కార్మికులతో ఆ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టరేట్ నుంచి నల్లవంతెన వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని చేనేత సొసైటీలలో ఉత్తమ ప్రతిభ చూపిన కార్మికులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ అభివృద్ధి అధికారి ఎం.రాజు, సహాయ అభివృద్ధి అధికారి ఏ.వెంకటేశ్వరరావు, బండారులంక చేనేత సంఘం మాజీ చైర్మన్ పి.వరదరాజులు, హసన్‌బాద్ చేనేత సంఘం మాజీ చైర్మన్ డి.ప్రకాష్, చేనేత సంఘాల మేనేజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎన్నికల సందడి

- నేడు నూతన ఎస్‌ఎంసీల ఏర్పాటు
- జిల్లాలో 1,581 ప్రభుత్వ పాఠశాలలు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి రెండేళ్లకు ఒకసారి పాఠశాలల్లో తల్లిదండ్రులతో కూడిన 'పాఠశాల యాజమాన్య కమిటీ' (ఎస్‌ఎంసీ) లను ఏర్పాటు చేస్తున్నారు. 2021 సెప్టెంబరు 22న ఎన్నికైన కమిటీల కాల పరిమితి 2023 సెప్టెంబర్ 21తో ముగిసింది. పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభమైన నేపథ్యంలో నూతన ఎన్నికలకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుని ఈ నెల 1న నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 5న ఓటర్ల జాబితా అభ్యంతరాల అనంతరం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఫైనల్ పబ్లికేషన్ చేశారు. దీంతో గురువారం పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎస్‌ఎంసీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల స్థాయి అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించగా, వారు పాఠశాల హెచ్‌ఎంలకు సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఉన్న 1,581 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు.

తల్లిదండ్రుల్లో ఒక్కరికే ఓటు హక్కు

ఈ ఎన్నికల్లో తొలుత తరగతి వారీగా ఎన్నికలు నిర్వహించి తల్లిదండ్రుల నుంచి ముగ్గురిని సభ్యులుగా ఎన్నుకుంటారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరికే ఓటు హక్కు ఉంటుంది. చేతులెత్తే విధానం, నోటి మాట ద్వారా సభ్యుల ఎన్నిక జరుగుతుంది. ఈ ప్రక్రియలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తితే రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు. ఎన్నికైన సభ్యులు తిరిగి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు.

ప్రాధాన్య క్రమంలో..

ఎస్‌ఎంసీకి ఎన్నికైన ముగ్గురు సభ్యుల్లో ఒకరు అనుకూల వర్గం నుంచి, ఒకరు బలహీన వర్గాల నుంచి, మూడో వారు జనరల్ కేటగిరీకి చెందినవారై ఉండాలి. అలాగే కమిటీలో ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్టెడ్ సభ్యులను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ పదవీ కాలం రెండేళ్లు ఉంటుంది. సభ్యుల పిల్లల చదువు రెండేళ్లలోపు పూర్తయినా, బడి వదిలేసినా వారు ఆ పదవిని కోల్పోతారు. అలాగే తరగతిలో ఉన్న ఓటర్ల సంఖ్యలో కనీసం 50 శాతం మంది హాజరు లేకుంటే కోరం లేకుంటే ఎన్నిక చెల్లదు. ఎదురవుతుంది.



ఎన్నికలు నిర్వహించనున్న ప్రభుత్వ పాఠశాల

ఏర్పాట్లు పూర్తి



ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ మేరకు ఎంఈఓలకు అవగాహన కల్పించాం.

– బీవీవీ సుబ్రహ్మణ్యం, సీఎంవో, ఎస్‌ఎంసీ ఎన్నికల నోడల్ అధికారి, సమగ్ర శిక్షా, అమలాపురం

తల్లిదండ్రులు సహకరించాలి



జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఎస్‌ఎంసీ ఎన్నికలకు పాఠశాల స్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే హెచ్‌ఎంలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాం. జిల్లా సెక్టోరల్ అధికారులు, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఎన్నికలను పర్యవేక్షిస్తారు. కమిటీల ఏర్పాటుకు తల్లిదండ్రులు సహకరించాలి.

– ఎ.మధుసూదనరావు, డిప్యూటీ కలెక్టర్, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

క్లుప్తంగా

అన్నవరం ఇన్‌చార్జి ఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్ బాబు

అన్నవరం: అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వ్యక్తిగత కారణాలతో ప్రస్తుత ఈఓ కె.రామచంద్రమోహన్ ఈ నెల 20వ తేదీ వరకు సెలవు పెట్టడంతో రమేష్ బాబును ఇన్‌చార్జిగా నియమించారు. శ్రావణమాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, గురువారం నుంచి వివాహాలు ప్రారంభం కానున్నందున అన్ని విభాగాల సిబ్బంది అప్రమత్తతతో ఉండి భక్తులకు సేవలు అందించాలని ఆదేశించారు.

ఏసీబీ డీఎస్పీగా కిశోర్‌కుమార్



ఏసీబీ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కిశోర్‌కుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏసీబీ ఉమ్మడి గోదావరి జిల్లా డీఎస్పీగా ఎం.కిశోర్ కుమార్ నియమితులయ్యారు. అవినీతి నిరోధకశాఖ డీజీ అతుల్‌సింగ్ ఉత్తర్వుల మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం రేంజ్ పరిధిలోని తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఆయన విధులు నిర్వర్తించనున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన రవికుమార్ (ఫైల్)

నల్లజర్ల: వర్షం ఓ వ్యక్తి నిండు ప్రాణాల్ని బలితీసుకుంది. పోతవరంలో బాదంపూడి రవి కుమార్ (34) భార్య, ఇద్దరు మగ పిల్లలతో పాతబడ్డ బంగాళాపెంకుటింట్లో నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఇల్లంతా నీటిమయం కావడంతో ఆ రాత్రి వేరేచోట తలదాచుకున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో సామగ్రి ఎలా ఉందో చూడటానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

ముద్దను నిర్లక్ష్యం చేస్తే మూడినట్టే

- ఆ వ్యాధితో పాల ఉత్పత్తిపై ప్రభావం
- జిల్లాలో ముమ్మరంగా వ్యాక్సినేషన్



ముద్ద చర్మ వ్యాధి సోకకుండా ఇంజెక్షన్లు చేస్తున్న పశువైద్యులు

కాకినాడ సిటీ: పశువులకు సోకే అతి ప్రాణాంతక వ్యాధుల్లో ప్రధానమైనది ముద్ద చర్మం (లంపీ స్కిన్) వ్యాధి. ఈ వ్యాధి అధికంగా తెల్లజాతి పశువుల్లో వస్తోంది. పశుపోషకులు చిన్న నిర్లక్ష్యం చేసినా మూగజీవాలు మృతి చెందే అవకాశం ఉందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి నివారణకు జిల్లాలో ఈ నెల 20 తేదీ నుంచి లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. జిల్లాలో 75,442 పశువులకు ఉచితంగా వ్యాక్సిన్లు వేయడం లక్ష్యం కాగా అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో పశువైద్యులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ మేరకు వ్యాక్సిన్లు పశువైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. అయితే జిల్లాలో ఇప్పటికే 32 వేలకు పైగా వ్యాక్సిన్లు వేసినట్లు అధికారులు చెప్పున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై పశు పోషకులకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

వ్యాధి సంక్రమణ ఇలా

పశువులను ఆశించే కీటకాల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. వేడి, తేమతో కూడిన వాతావరణం ఉన్న నెలల్లో వ్యాధి వ్యాప్తి ఎక్కువ. జోరీగ, రక్తం పీల్చే ఈగలు, దోమలు, కొడుసుల ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు రైతులు వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులతో కలపడం, వాటి దాణా పాత్రలు వీటికి వినియోగించడం ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు

- పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి.
- అధిక జ్వరంలో బాధపడతాయి.

జిల్లాలో పశువుల వివరాలు..	
ఆవులు	76,502
గేదెలు	2,82,273
గొర్రెలు	1,41,229
మేకలు	1,01,870
కోళ్లు	32,48,636

- కళ్ల నుంచి నీరు కారడం, ముక్కు, నోటి ద్వారా చొంగలు వస్తాయి.
- శరీరమంతా కణతులు, బొడిపెలు, రక్తం కారే పుండ్లు ఏర్పడతాయి. పక్కటెముకలు, కాళ్లు, వెన్నెముక, పొదుగు, కనురెప్పలు తదితర భాగాలకు వ్యాప్తి చెందుతాయి. వీటి ప్రభావం 7 నుంచి 12 రోజుల వరకూ ఉంటుంది.
- పశువులు బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి.
- వ్యాధి సోకిన పశువులు తక్కువగా పాలు ఇస్తాయి.

చికిత్స విధానం

- వ్యాధి సోకిన పశువులను మిగిలిన పశువుల నుంచి వేరు చేయాలి.
- వ్యాధి తీవ్రత బట్టి మందులు వాడాలి.
- జ్వరం, కాళ్ల వాపు అధికంగా ఉంటే తగిన యాంటీ ఇన్ ఫ్లమేటరీ మందులు అందించారు.
- గంతలతో కూడిన గాయాలు ఏర్పడితే యాంటీ బయాటిక్‌తో కూడిన అయింట్మెంట్ వాడాలి.
- దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా పశువైద్యుని సూచన మేరకు మందులు వినియోగించాలి.
- హోమియో, ఆయుర్వేద మందులు తిప్పతీగ, నేల వేము తదితర వ్యాధి నిరోధకశక్తి పెంచే మందులు వాడటం శ్రేయస్కరం.

టీకాలు తప్పక వేయించాలి



ముద్ద చర్మవ్యాధి పశువులకు ప్రమాదకరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వ్యాక్సిన్ వినియోగిస్తే ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. పశువుల కోసం వేస్తున్న ముద్ద చర్మ వ్యాధి నివారణ వ్యాక్సిన్‌ను పశువులకు వేయించాలి.

డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి, కాకినాడ

వ్యాధి నివారణ

- బాధిత పశువులను ఇతర ప్రదేశాలకు తరలించరాదు. సంతలో క్రయ విక్రయాలు చేయకూడదు.
- వ్యాధి ప్రభావిత ప్రాంతం నుంచి పశువులు వలస వెళ్లకుండా చూడాలి.
- కీటకాల నియంత్రణ, దోమతెరల వినియోగం, పశువుల తొట్టెలు (దాణా పాత్రలు) శుభ్రం చేయాలి. వేపాకు ధూపం వేయాలి.
- ఏదైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక పశువైద్యులను సంప్రదించాలి.

అత్తింటి వేధింపులపై వివాహిత ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న రేష్మ

సీటీఆర్ఐ: ఆర్థిక అవసరాలు తీర్చుకుని ఆనక ఇంటి నుంచి గెంటేసిన అత్తింటివారి నుంచి న్యాయం చేయాలని కోరుతూ ఆ ఇంటి కోడలు హోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయక కుమారుడితో సహా ఇంటి ముందు ఆందోళనకు దిగింది. వివరాల్లోకి వెళ్తే స్థానిక రాజేంద్రనగర్‌లో ఉంటున్న ఖాదీర్‌బాషా, సాహిదాబేగం కుమారుడు అబీద్ బాషాతో రేష్మకు 2012 అక్టోబర్ 12న వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.4.2 లక్షల కట్నం, 25 కాసుల బంగారం, ఆ తరువాత కారు కొనుగోలుకు అతడికి రూ.2 లక్షల వరకు ముట్టచెప్పారు. అనంతరం ఇల్లు కట్టేందుకు ఆమె బంగారాన్ని భర్త, అత్త మామలు తీసుకున్నారు. తన బంగారం తిరిగి ఇవ్వాలని రేష్మ ప్రశ్నించడంతో ఆమెను వేధిస్తూ కోర్టులో తేల్చుకుందాం అంటూ బయటికి గెంటేశారు. 9 ఏళ్లగా కోర్టు చుట్టూ తిప్పుతున్నారని, వాయిదాలకు రాకుండా వేధిస్తున్నారని ఆమె వాపోయింది. నెలకు 16 వేలు నిర్వహణ ఖర్చులు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదని, దీనితో కుమారుడ్ని పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేసింది. తనని కాపురానికి తీసుకెళ్లాలని, కుమారుడ్ని స్వీకరించాలని, తనకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేస్తూ అత్తింటి ముందు బుధవారం ఆమె ఆందోళనకు దిగింది.

మద్యం తాగి వాహనం నడిపినందుకు జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ముగ్గురికి రెండురోజులు జైలు శిక్ష, 8 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. తాళ్లరేవు మండలం కోరంగి, గొల్లపాలెం, పెద్దపూడి పోలీసు స్టేషన్ల పరిధిలో మద్యం తాగి బైక్‌పై వెళ్తున్న వారిపై కేసులు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. నిందితుల్లో ముగ్గురికి రెండు రోజులు జైలు శిక్ష, 8 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో...

మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఆరుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ టూటౌన్, త్రీ టౌన్, తిమ్మాపురం, ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. బుధవారం కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు

లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్ మృతి



ఘటనాస్థలంలో మృతుడు శివశంకర్, చిత్రంలో డివైడర్ పైనుంచి అవతలి రోడ్డు దిగువకు దూసుకువెళ్లిన వ్యాన్

రాజానగరం: దివాన్‌చెరువులోని జీరో పాయింట్ నుంచి గామన్ బ్రిడ్జికి వెళ్లే రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో 6 టైర్ల ఐషర్ వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. నూజివీడు మండలం, శోభనాపురానికి చెందిన డ్రైవర్ ఈడే శివశంకర్ (39) వ్యాన్ పై విశాఖపట్నం నుంచి విజయవాడకు తిరిగి వస్తున్న సమయంలో గామన్ బ్రిడ్జికి వెళ్లే రహదారి పై కొంతమూరు సమీపంలోని ప్రకృతి వనం వద్ద వ్యాన్ టైర్ పంచరైంది. దీనితో వాహనాన్ని పక్కకు ఆపి, టైరు మార్చుకుంటున్న సమయంలో విశాఖపట్నం నుంచి బాపట్లకు కిరాణా సరుకుల లోడుతో వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో వ్యాన్ డివైడర్ పైనుంచి అవతలి రోడ్డులో దిగువకు దూసుకుపోయింది. ఆ వాహనానికి టైరు మార్చే ప్రయత్నంలో ఉన్న శివశంకర్ కూడా ఎగిరి డివైడర్ పై పడడంతో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ షేక్ బడే స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారని కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై మనోహర్ తెలిపారు.

ఎదురెదురుగా కార్లు ఢీ

- ఏడుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- రాజమహేంద్రవరం తరలింపు



ఘటనాస్థలంలో నుజ్జయిన కార్లు

గోపాలపురం: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బుధవారం గోపాలపురానికి చెందిన నలుగురు యువకులు కొయ్యలగూడెం నుంచి వస్తుండగా గోపాలపురం నుంచి కొయ్యలగూడెం వెళ్తున్న కారును వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. కొయ్యలగూడేనికి చెందిన కారులో ప్రయాణిస్తున్న మహిళకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ఆరుగురికి గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేశారు. ప్రమాదానికి గురైన కార్లలో ఎయిర్‌బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో భారీ ప్రాణాపాయం తప్పిందని ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు.

సామర్లకోట సీఐ బదిలీ

సాక్షి ఎఫెక్ట్

కాకినాడ క్రైం: సామర్లకోట సీఐని బదిలీ చేశారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'కుర్చీలాట.. కాసుల వేట' కథనానికి స్పందన లభించింది. ఆరోపణలు తలెత్తిన నేపథ్యంలో సామర్లకోట సీఐ అంకబాబును బదిలీ చేసి ఏలూరు రేంజి వీఆర్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఆరోపణలు వచ్చిన ఇతర సర్కిళ్లలోని నియామకాలపై విచారణ జరిపి చర్యల కోసం ఐజీకి సిఫార్సు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు.

వంచకుడిపై కేసు నమోదు

ముమ్మిడివరం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేశారు. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి వలసల తిప్ప గ్రామానికి చెందిన వివాహిత భర్త నుంచి విడిపోయి పుట్టింటిలో ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఎలిపే రామకృష్ణ కొంత కాలంగా ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వెంట పడుతున్నాడని, గత మే నెలలో తన ఇంటి డాబాపై ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని పేర్కొంది. అంతే కాక ఈవిషయం తల్లితండ్రులకు చెప్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో తాను ఎవరికీ చెప్పలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

ఇటీవల ఆమె అనారోగ్యంగా ఉండడంతో తల్లి ఆసుపత్రికి తీసుకు వెళ్లగా ఆమె గర్భవతి అని వైద్యులు తెలిపారు. రామకృష్ణను పెళ్లి చేసుకోమని పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా అతడు నిరాకరించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. సీఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4,529 కిలోల బియ్యం సీజ్

- సరకు విలువ రూ.2.06 లక్షలు
- పాశర్లపూడిలో విజిలెన్స్ దాడులు



పాశర్లపూడిలో దాడి చేసిన దుకాణం వద్ద విజిలెన్స్ అధికారులు

మామిడికుదురు: మండలంలోని పాశర్లపూడి గ్రామంలో బుధవారం రెండు ప్రాంతాల్లో విజిలెన్స్ దాడులు నిర్వహించి 4529 కిలోల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. రూ.2.06 లక్షల విలువైన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ ఉంచిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. తోట సుబ్బారావు షాపింగ్ కాంప్లెక్స్ గోడౌన్‌లో నిల్వ ఉంచిన 1,850 కిలోలు బియ్యాన్ని సీజ్ చేశామని విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. బియ్యం నిల్వ ఉంచిన బొరుసు మురళీకృష్ణ, షాపింగ్ కాంప్లెక్స్ యజమాని తోట సుబ్బారావుపై నగరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. అదే గ్రామంలోని కొండాలమ్మచింత సెంటర్‌లో రామా ట్రేడర్స్‌ను తనిఖీ చేసి 104 బస్తాల్లో నిల్వ ఉంచిన 2,679 కిలోలు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. దుకాణ యజమాని తోట భగవన్నారాయణపై కేసు నమోదు చేశామని తెలిపారు. రాజమండ్రి రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిఘా కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీలో బిజిలెన్స్ ఎస్సై టి.జగన్నాథరెడ్డి, ఏఓ జె.భార్గవ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

18 మందికి మెమో జారీ

అయినవిల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా ఫించన్ల విషయంలో అలసత్వం వహించిన 18 మందికి మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఒకటో తేదీన ఉదయం 8 గంటల్లోపు ఫించన్ పంపిణీ ప్రారంభించవలసి ఉండగా 8 గంటల తర్వాత ప్రారంభించినందుకు గాను ఎనిమిది గ్రామాల్లోని 18 మంది సచివాలయ సిబ్బందికి మెమో ఇచ్చినట్లు తెలిపారు.

నేడు పొగాకు బోర్డు చైర్మన్ రాక

దేవరపల్లి: దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ గురువారం మధ్యాహ్నం సందర్శించనున్నారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమవుతారని రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని రెండు, ఏలూరు జిల్లాలోని మూడు వేలం కేంద్రాలను ఆయన సందర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని రైతులు హాజరు కావాలని కోరారు.

అమ్మల లాలనకు ప్రత్యేక గది ఏర్పాటు

అంబాజీపేట: అప్పుడే పుట్టిన బిడ్డలతో పాటు రెండేళ్లలోపు చిన్నారులకు మాతృత్వం అందించడం ఒక గొప్ప విషయం. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక స్త్రీల ఆసుపత్రిలో చిన్నారులకు మాతృత్వం అందించే విషయంలో గోప్యత పాటించేందుకు ప్రత్యేకంగా ఒక గదిని అమ్మల లాలన పేరుతో బుధవారం ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సీఈఓ డాక్టర్ హేవార్డ్‌రాజ్ మాట్లాడుతూ ఆసుపత్రిలోని చిన్నారులతో పాటు దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వస్తున్న వారి సౌలభ్యం కోసం వారి వారి చిన్నారులకు మాతృత్వం అందించేందుకు అమ్మల లాలన గదిని సుమారు రూ.60 వేలతో ఏర్పాటు చేశామన్నారు.

జాతీయ పతకమే లక్ష్యం

- తైక్వాండోలో రాణిస్తున్న 'తూర్పు' క్రీడాకుసుమాలు
- జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పతకాలు కైవసం



కాకినాడ డీఎస్ఏలో ఇటీవల జరిగిన సబ్ జూనియర్స్ తైక్వాండోలో పోటీ పడుతున్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ) : మార్షల్ ఆర్ట్స్‌లో పట్టు సాధించాలంటే కత్తిమీద సామే. ప్రస్తుత కాలంలో సమాజంలో జరుగుతున్న ఆరాచకాలు, దుష్టక్రియలు ఎదుర్కొనాలంటే తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ప్రతి ఒక్కరికీ అవసరం. ఆత్మరక్షణకే కాక ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు ఈ క్రీడ దోహదపడుతుంది. అయితే వారందరూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ జాతీయ స్థాయిలో పతకం సాధించాలనే లక్ష్యంతో తైక్వాండోలో శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి తోటి క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్, జూనియర్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. విశాఖలో ఈ నెల రెండో తేదీన జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సాక్షితో తమ మనోభావాలు పంచుకున్నారు. వివరాలు వారి మాటల్లోనే..

జాతీయస్థాయిలో పతకం సాధిస్తా



నాపేరు పి.మోనిషా. నేను 8వ తరగతి చదువుతున్నాను. గత ఐదేళ్లుగా కోచ్ సత్యనారాయణ వద్ద తైక్వాండో నేర్చుకుంటున్నాను. జూనియర్స్ విభాగంలో జిల్లాస్థాయిలో 3 బంగారు, 1 రజత, రాష్ట్రస్థాయిలో ఒక రజత పతకం కైవసం చేసుకున్నాను. బాగా చదివి న్యాయవాది అవ్వాలనేది నా కోరిక. తైక్వాండోలో జాతీయస్థాయిలో పతకం సాధించడం నా ముందున్న లక్ష్యం. ప్రతిరోజూ రెండు గంటలు సాధన చేస్తాను.

కలెక్టర్ కావడమే లక్ష్యం



నా పేరు జి.జెస్సీ. నేను అంబాజీపేటలో నాలుగో తరగతి చదువుతున్నాను. డాడీ, మమ్మీ ప్రోత్సాహంతో తైక్వాండో నేర్చుకుంటున్నాను. జిల్లాస్థాయిలో రెండు బంగారు, ఒక రజత పతకం సాధించాను. కలెక్టర్ కావడం నా లక్ష్యం. సంవత్సరం నుంచి తైక్వాండో నేర్చుకుంటున్నాను.

అంతర్జాతీయ క్రీడాకారుడిని అవ్వాలి



నా పేరు ఇషాన్. నేను 7వ తరగతి చదువుతున్నాను. మాది కాకినాడ. గత ఏడాది గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నాను. మరిన్ని పోటీల్లో పాల్గొనాలని కోరుకుంటున్నాను. తైక్వాండోలో రాణించి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకోవాలనేది నాలక్ష్యం.

ఆర్మీ ఆఫీసర్ అవుతా



నా పేరు లోహిత తేజ. నేను నగరంలో 5వ తరతగతి చదువుతున్నాను. సబ్‌జూనియర్స్ విభాగంలో ఈ పోటీలలో పాల్గొంటున్నాను. ఇప్పటి వరకు రెండు గోల్డ్, ఒక సిల్వర్ మెడల్ సాధించాను. తైక్వాండోలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఆర్మీ ఆఫీసర్ ఉద్యోగం పొందడం నాలక్ష్యం.